కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడ రూరల్, మార్చి 16 : సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కించపరిచేలా తాగుబోతు తెలంగాణ జాతిపిత ఎలా అవుతాడు అంటూ మాట్లాడడం సిగ్గు చేటని, వెంటనే రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కిందని, అలాంటి వ్యక్తిపై విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అబద్ధపు మాటలతో అమాయక ప్రజలను తప్పుదొవ పట్టిస్తున్నాడని అన్నారు. రాజకీయ విమర్శలు చేయడంలో తప్పులేదని, వ్యక్తి గత విమర్శలు చేస్తే బీఆర్ఎస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు మన్నె అనిల్, మమ్మయి లక్ష్మణ్, నల్లోల్ల సాయిలు, జీవన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సభ్యులు

కామారెడ్డి, మార్చి 16 :జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని గంజ్ ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్య వైశ్యులంతా ఆయన అడుగు జాడలో నడవాలని, రాష్ట్రం కోసం తన ప్రాణాలను వదిలిన గొప్ప వీరుడు అని అన్నారు. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరు మార్చాలని అనుకున్న తెలంగాణ ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు గరిపల్లి శ్రీధర్, రీజినల్ చైర్మన్ మోటూరి శ్రీకాంత్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మొగిలిపల్లి భూమేశ్, కూర శ్రీనివాస్, భాస్కర్, యాద అంజయ్య, విశ్వం, శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సెల్ బైక్, కారు ఢీ : ఇద్దరికి గాయాలు

మాచారెడ్డి, మార్చి 16 : ఎక్సెల్ బైక్, కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లోని ఓ పెట్రోల్ పంపు ఎదురుగా చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచారెడ్డికి చెందిన వడ్లూరి నర్సయ్య, సంగోళ్ల నారాయణ గజ్యానాయక్‌తండాకు వచ్చి తిరుగు ప్రయాణంలో మాచారెడ్డికి వెళ్తుండగా పెట్రోల్ పంపు వద్ద యూటర్న్ తీసుకుంటుండగా కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఏరియా దవాఖానకు తరలించారు.

యథేచ్ఛగా మొరం దందా!

- రాత్రింబవళ్లు లారీల్లో అక్రమంగా తరలింపు
- కరువైన అధికారుల నిఘా
- పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన వ్యాపారులు

సోమేశ్వర్ శివారులో మొరం తవ్వుతూ టిప్పర్‌లో నింపుతున్న జేసీబీ

బాన్సువాడ రూరల్, మార్చి 16 : బాన్సువాడ మండలంలో కొండలన్నీ తరిగిపోతున్నాయి.. పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమంగా మొరం తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మొరం అక్రమ వ్యాపారాన్ని అరికట్టాల్సిన అధికారులూ వ్యాపారులకు అండగా నిలువడంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. అక్రమ మొరం దందా బాగుండడంతో అక్రమార్కులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు. జేసీబీలతో మొరం తవ్వి, లారీల్లో నింపి ప్రైవేటు వెంచర్లకు తరలిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా ఖాజానాకు గండికొడుతున్నారు. బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్, బుడ్మి శివారులో, పోచారం, రాంపూర్, దేశాయిపేట్, హన్మాజీపేట్ గ్రామాల అటవీ ప్రాంతాల్లో యథేచ్ఛగా అక్రమంగా మొరం దందా కొనసాగుతున్నది. ఒక్కో లారీ మొరం ట్రిప్పు రూ.4 నుంచి రూ.5వేలకు విక్రయిస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం కోసమెరుపు.

సెలవు దినాల్లో పండుగే..

ప్రభుత్వ సెలవులు వచ్చాయంటే మొరం వ్యాపారులకు పండగే. ఆదివారం వచ్చిందంటే చాలు శనివారం రాత్రి నుంచే గుట్టల్లో జేసీబీల చప్పుళ్లు మొదలవుతాయి. అధికలోడ్‌తో వెళ్లే మొరం టిప్పర్లు రోడ్డుపై దర్శనమిస్తాయి. వెంచర్ల యజమానులతో ముందుగానే మాట్లాడుకొని మొరం ట్రిప్పులు బుక్ చేసుకుంటారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు మొరాన్ని వెంచర్లకు తరలించి అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. కొందరు వ్యాపారులకు ప్రభుత్వ అధికారుల అండదండలు ఉన్నాయని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

అధికారుల నిఘా కరువు..

అధికారుల అలసత్వం, ప్రజల అమాయకత్వంతో అక్రమ మొరం వ్యాపారులు రెచ్చిపోతున్నారు. మట్టి, మొరం తవ్వుకు పోతున్నారు. అడ్డూ అదుపు లేకుండా దూసుకెళ్తున్న లారీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అధికారుల నిఘా లోపం అక్రమ వ్యాపారులకు వరంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా స్థాయి అధికారులు మండల కేంద్రంలో ఉన్నప్పటికీ మొరం అక్రమ దందా కొనసాగుతుండడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని అక్రమ మొరం దందాను అరికట్టి ప్రకృతి సంపదను కాపాడాలని కోరుతున్నారు.

ప్రైవేటు వెంచర్లలో వేస్తున్న మొరం

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు

ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మొరం తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. నిబంధనలకు విరుద్ధంగా మొరం తరలిస్తే పోలీసుశాఖ సహకారంతో వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేస్తాం. మొరం తరలిపునకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు.

- వరప్రసాద్, తహసీల్దార్, బాన్సువాడ

పన్ను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించండి

బాన్సువాడ, మార్చి 16 : బాన్సువాడ మున్సిపల్ పరిధిలో ఇంటి పన్ను, వృత్తివ్యాపార లైసెన్సులు, నల్లా బిల్లులు వెంటనే చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాన్సువాడ పరిధిలో చాలా మంది పన్ను చెల్లించాల్సి ఉన్నదని పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారికి రిబేట్ ఇచ్చే అవకాశం ఈ నెల 31తో ముగుస్తున్నదని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీడీ కార్మికుల జీవన భృతికి తగిన బడ్జెట్ కేటాయించాలి

బాన్సువాడ, మార్చి 16 : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో బీడీ కార్మికులకు రూ.4,016 జీవన భృతికి తగిన బడ్జెట్‌ను కేటాయించాలని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బీఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని బీడీ పరిశ్రమలో పనిచేసే కార్మికులు, ప్యాకర్లు, బట్టి చటన్ తదితరులకు గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం అసెంబ్లీ సమావేశంలో తగినంత బడ్జెట్ కేటాయించాలని పేర్కొన్నారు. లేని పక్షంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలను ఆయా మండలాలు, గ్రామాల్లో తిరగనివ్వమని, ప్రగతి భవన్, ఎమ్మెల్యేలు, సీఎం నివాసాలను ముట్టడించడానికి కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ

బాన్సువాడ, మార్చి 16 : బిచ్కుంద మండలంలోని గుండెకల్లూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు స్థానిక నాయకులతో కలిసి ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీటిలో మునిగి యువకుడి మృతి

బాన్సువాడ, మార్చి 16 : జుక్కల్ మండలంలోని పెద్దగుల్లా గ్రామానికి చెందిన దావాడ ప్రకాశ్(30) గుల్లా గ్రామంలోని దేశ్‌ముఖ్ చెరువుకు స్నానం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లు జుక్కల్ ఎస్సై భువనేశ్వర్‌రావు ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశ్ ఈ నెల 14న స్నేహితులతో కలిసి హోలీ ఆడేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. హోలీ అనంతరం స్నానం చేసేందుకు దేశ్‌ముఖ్ చెరువుకు వెళ్లారు. యువకులు స్నానం చేసిన తర్వాత వచ్చేశారు. కానీ.. ప్రకాశ్ మాత్రం ఇంటికి రాలేదు. ఆదివారం మృతదేహం లభించింది. నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడని, తమకు ఎవరిపై అనుమానాలు లేవని తల్లి తెలిపినట్లు ఎస్సై వివరించారు. తల్లి చందర్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కామారెడ్డి, మార్చి 16 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఉన్న దేవునిపల్లి జడ్పీహెచ్ఎస్ 1997-98 విద్యా సంవత్సరంలో చదవిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 28 ఏండ్ల తర్వాత కలుసుకున్నారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్డ్ షాపుపై పోలీసుల దాడి

బీబీపేట్(దోమకొండ), మార్చి 16 : మండలంలోని ముత్యంపేట గ్రామంలో మద్యం విక్రయిస్తున్న బెల్డ్ షాపుపై ఎస్సై ప్రవంతి సిబ్బందితో కలిసి శనివారం రాత్రి దాడి చేశారు. 34 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని బెల్డ్ షాపు యజమాని భూమయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆదివారం తెలిపారు.

రాష్ట్రస్థాయి సాహితీ పురస్కారానికి ఎంపిక

కామారెడ్డి, మార్చి 16 : పట్టణానికి చెందిన కవి, రచయిత, అధ్యాపకుడు డాక్టర్ శంకర్ తెలంగాణ సారస్వత పరిషత్ బూర్గుల రంగనాథరావు రాష్ట్రస్థాయి సాహితీ పురస్కారానికి ఎంపికయ్యాడు. తెలంగాణలో తెలుగు సాహితీ రంగానికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు ప్రకటించారు. హైదరాబాద్ రాష్ట్ర మాజీ సీఎం బూర్గుల రామకృష్ణారావు కుమారుడు బూర్గుల రంగనాథరావు పేరు మీదుగా ఏర్పాటు చేసిన ఈ అవార్డుకు ఎంపిక కావడం రచయితగా మరింత బాధ్యత పెంచిందని శంకర్ అన్నాడు.ఈ నెల 18వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ పురస్కారానికి ఎంపిక కావడంపై పలువురు కవులు, రచయితలు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

మిషన్ భగీరథ తాగునీరు వృథా

పెద్ద కొడప్‌గల్, మార్చి 16 : మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ నుంచి తాగునీరు వృథా పోతున్నదని, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద కొడప్‌గల్ మండలంలోని కాటేపల్లి గ్రామం నుంచి కాటేపల్లి తండాకు వెళ్లే పైపులైన్ గ్రామ సమీపంలోని కుమ్మరికుంట, లక్ష్మీదేవి గుడి వద్ద ఎయిర్‌వాల్ చాంబర్ కొద్ది రోజుల నుంచి మిషన్ భగీరథ తాగునీరు వృథాగా పోతున్నదని, తండాలో తాగునీటి ఇబ్బందులు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని తండా ప్రజలు ఆరోపిస్తున్నారు. పిట్లం మండలంలోని కారేగాం గ్రామం నుంచి గోద్మెగాం వెళ్లే పైపులైన్ కారేగాం గ్రామం కోతి గుడి సమీపంలో మిషన్ భగీరథ తాగునీరు వృథాగా పోతున్నదని సమస్య పరిష్కరించాలని కారేగాం, గోద్మెగాం ప్రజలు కోరుతున్నారు.

కాటేపల్లి సమీపంలో వృథాగాపోతున్న మిషన్ భగీరథ తాగునీరు

ఐదో రోజు చేరిన నిరసన దీక్షలు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 16: ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేస్తున్న నిరసన దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. గ్రూప్-1, 2, 3 ఉద్యోగ ఫలితాలు, ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పద్మారావు, శివానందం, పౌలు, మానయ్య, రాజు, సామెల్ తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మద్నూర్, మార్చి 16 : మద్నూర్‌లో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదివారం ప్రారంభించారు. రోడ్డు పనులకు రూ.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లతోపాటు మురికి కాలువలు నిర్మిస్తామని, పూర్తిస్థాయిలో గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాయిపటేల్, హన్మాండ్లు, స్వామి, సాయిలు, ప్రజ్ఞకుమార్, హన్మంత్‌యాదవ్, జావేద్‌పటేల్, పరమేశ్‌పటేల్, అశోక్, శివాజీ, గోపి, రాజు, శంకర్, బాలు, హన్మాండ్లు, సంతోష్, దత్తు, సాయిలు తదితరులు ఉన్నారు.

వెల్లుట్ల పేట గ్రామంలో..

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 16: మండల పరిధిలోని వెల్లుట్ల పేట గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ ప్రజలకు ఇబ్బందులు కాకుండా త్వరలో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక నాయకులు కోరారు. కార్యక్రమంలో సాయిబాబ, గణపతి, సుతారి సాయిలు, కొయ్యల రాజాగౌడ్, అంజయ్య, రాజు, మల్లేశ్ తదితరులున్నారు.

హస్నాపూర్ గ్రామంలో..

పెద్ద కొడప్‌గల్(పిట్లం), మార్చి 16 : పిట్లం మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు జంబిగే హన్మాండ్లు, రాంరెడ్డి, మోహరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 16 : మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ సూచించారు. ఎల్లారెడ్డి శివారులో ఆయన ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి వస్తుందన్నారు. వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పలువురికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో జమ్మేదార్ పూర్యానాయర్, హోంగార్డ్ ప్రసాద్ తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

లింగంపేట, మార్చి16 : మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయ నిర్మాణం కోసం గంగపుత్ర సంఘం సభ్యులు విరాళం అందించారు. మత్తడి పోచమ్మ ఆలయానికి విరాళాలు సేకరించి నూతనంగా ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం సభ్యులు ఆదివారం రూ.31వేల విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నీటి కోసం వన్యప్రాణులు విలవిల

- సాసర్ పిట్లలో కరువైన తాగునీరు
- పట్టించుకోని అధికారులు

అటవీ ప్రాంతంలో నీరు లేకుండా ఉన్న సాసర్‌పిట్(ఫైల్)

లింగంపేట, మార్చి16: అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్‌పిట్లలో తాగునీరు లేకపోవడంతో వన్యప్రాణులు విలవిలాడుతున్నాయి. వేసవి ఆరంభంలోనే ఎండలు మండిపోవడంతో వన్యప్రాణులు తాగునీటి కోసం అటవీ ప్రాంతాన్ని వదిలి గ్రామ శివారుల్లోని చెరువులు, కుంటల వద్దకు వస్తున్నాయి. అటవీ శాఖ ఎల్లారెడ్డి రేంజ్ పరిధిలోని ఆయా మండలాల్లో ఉన్న అటవీ ప్రాంతాల్లో సుమారు వందకుపైగా సాసర్‌పిట్ల నిర్మాణం చేపట్టారు. వేసవిలో వన్యప్రాణులకు తాగునీటిని అందించడానికి అటవీ శాఖ అధికారులు కొన్నేండ్ల క్రితం రేంజ్ పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న అటవీ ప్రాంతాల్లో సాసర్‌పిట్ల నిర్మాణం చేపట్టారు. ప్రతి సంవత్సరం వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపి వన్యప్రాణులకు తాగునీటిని అందుబాటులో ఉంచేవారు. కానీ ప్రస్తుతం మార్చి నెలలోనే ఎండలు మండి పోవడంతో తాగునీటి కోసం వన్యప్రాణులు విలవిలాడుతున్నాయి. అటవీ ప్రాంతంలోని కుంటలు, గుంతల్లో నీరు లేకపోవడంతో గ్రామ శివారుల్లోకి వన్యప్రాణులు వస్తున్నాయి. వారం రోజుల వ్యవధిలో లింగంపేట గ్రామ శివారులో మత్తడి పోచమ్మ ఆలయానికి వెళ్లే రహదారిలో ఎలుగుబంటి సంచరించినట్లు స్థానికులు తెలిపారు. మత్తడి పోచమ్మ ఆలయానికి వెళ్లే రహదారిలో ఉన్న పంట పొలాల్లోకి వచ్చి నీటిని తాగి వెళ్లినట్లు తెలిపారు. లింగంపేట మండల కేంద్రంతోపాటు చింతల్‌గుట్ట తండా వద్ద ఉన్న కుంటలోకి నీటి కోసం ఎలుగుబంటి వచ్చినట్లు తెలిపారు. అలాగే కంచుమహల్ గ్రామ శివారులో 15 రోజుల క్రితం చిరుత కనిపించిందని, కుంటలో నీరు తాగి వెళ్లినట్లు తెలిపారు. ఎల్లారెడ్డి రేంజ్ పరిధిలోని ఆయా మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో వందల సంఖ్య లో వివిధ రకాల వన్యప్రాణులు ఉన్నాయి. గ్రామ శివారుల్లోకి వచ్చిన వన్యప్రాణులు వేటగాళ్లకు చిక్కుతున్నాయి. వాహనదారులకు ప్రధాన రహదారులపై ప్రయాణాలు చేస్తున్న సమయం లో వన్యప్రాణులు కనిపించడంతో భయాందోళనకు గురువుతున్నారు. ఎల్లారెడ్డి అటవీ శాఖ రేంజ్ పరిధిలోని లింగంపేట మండలంలో 29 సాసర్‌పిట్లు, తాడ్వాయి మండలంలో ఆరు, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల్లో 50కిపైగా సాసర్ పిట్లను నిర్మించారు. గతంలో అటవీ శాఖ అధికారులు వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటిని పోసే వారు. ప్రస్తుతం సాసర్‌పిట్లలో నీటిని పోసే వారు కరువయ్యారు.

ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తాం

సాసర్‌పిట్లల్లో గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం. సాసర్‌పిట్లలో తాగునీటిని నింపడానికి ప్రత్యేకంగా నిధులు లేవు. అటవీ ప్రాంతంలోని కుంటల్లో తాగునీరు అందుబాటులో ఉన్నందున నీటిని నింపడం లేదు. వన్యప్రాణులకు తాగునీటిని అందించి వాటిని కాపాడుకుంటాం.

- ఓంకార్, ఎఫ్ఆర్‌వో

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

బాన్సువాడ రూరల్, మార్చి 16 : బాన్సువాడ మండలంలోని జక్కల్‌దాని తండా శివారులో శనివారం ప్రమాదవశాత్తు నిజాంసాగర్ ప్రధాన కాలువలో గల్లంతైన సిద్దూ (18) మృతదేహం లభ్యమైంది. మండలంలోని హన్మాజీపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని సంగ్రాం నాయక్ తండాకు చెందిన సిద్దూ నిజాంసాగర్ కాలువ ఒడ్డున నిలబడి కాళ్లు, చేతులు కడుక్కునే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి గల్లంతయ్యాడు. యువకుడి కోసం శనివారం నుంచి గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది కాలువలో గాలింపు చేపట్టారు. ఆదివారం ఉదయం యువకుడి మృతదేహం లభించింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు.

ఫ్రూట్ సలాడ్‌లో పురుగులు

ఫ్రూట్ సలాడ్‌లో వచ్చిన పురుగు

బాన్సువాడ, మార్చి 16 : పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తాలో ఒక పేరు గాంచిన ఐస్ క్రీం, ఫ్రూట్ సలాడ్, ఫలుదా విక్రహించే దుకాణంలో ఆదివారం పాత బాన్సువాడ కు చెందిన ఒక వ్యక్తి ఫ్రూట్‌సలాడ్ కొనుగోలు చేశాడు. ఇంటికెళ్లి చూసేసరికి దాంట్లో పురుగులు కనబడడంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. జ్యూస్‌లలో కుళ్లిపోయిన పండ్ల రసాలు, రసాయనాలు కలిపి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సంబంధిత ఫుడ్‌సేఫ్టి అధికారులు అటువైపు కన్నెత్తిచూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు దుకాణాలపై కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కొబ్బరికాయల విక్రయానికి వేలం

లింగంపేట, మార్చి 16 : మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయానికి వేలం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దుర్గెట్టి అశోక్ తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా మత్తడి పోచమ్మ ఆలయం వద్ద ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఉత్సవాలకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలే కాకుండా తాడ్వాయి, గాంధారి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, కామారెడ్డి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు ఉత్సవాలకు వస్తుంటారు. ఉత్సవాల సందర్భంగా ఐదు రోజులపాటు కొబ్బరికాయల విక్రయం కోసం వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని ఆయన కోరారు.

గోపాల్‌పేట తైబజార్..

నాగిరెడ్డిపేట, మార్చి16: మండల కేంద్రం గోపాల్‌పేటలో తైబజార్ వేలం పాటను సోమవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు. స్థానిక గోపాల్‌పేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.50వేలు చెల్లించాలన్నారు. వేలంలో దక్కించుకున్న వారు వెంటనే 50 శాతం డబ్బులు చెల్లించాలన్నారు. మిగతా డబ్బులకు చెక్కులను ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

పిట్లంలో..

పెద్ద కొడప్‌గల్(పిట్లం), మార్చి 16 : పిట్లంలో సోమవారం తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి బల్‌రాం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పిట్లం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు మండల ప్రత్యేకాధికారి కమలాకర్ ఆధ్వర్యంలో తైబజార్ నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు పంచాయతీకి ఎలాంటి బాకీ ఉండొద్దన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట/బీబీపేట్, మార్చి 16 : ఎల్ఆర్ఎస్ పెండింగ్‌లో ఉన్న ప్లాట్ల యజమానులు రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవోలు నరేశ్, పూర్ణ చంద్రోదయకుమార్, ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ పెండింగ్‌లో ఉన్న వారు ఈ నెల 31వ తేదీలోగా చెల్లించుకుంటే 25 శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ప్లాట్ల యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పెండింగ్‌లో ఫీజు చెల్లించుకోవాలని సూచించారు. 31వ తేదీ తర్వాత పూర్తి స్థాయిలో చెల్లించాల్సి వస్తుందన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఈఎంఆర్ఎస్ ప్రవేశ పరీక్ష

గాంధారి ఈఎంఆర్ఎస్‌లో ప్రవేశ పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు

గాంధారి, మార్చి 16 : మండల కేంద్రంలోని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల లో (ఈఎంఆర్ఎస్) 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన పరీక్షను మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించారు. ప్రవేశ పరీక్ష రాయడానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన 272 మంది విద్యార్థులు దరఖా